సాక్షి ఖమ్మం

ఆదివారం । 19 । జనవరి । 2025



ఆగని ఆక్రమణలు

ఖమ్మం అర్బన్, రూరల్ మండలాల్లో పంట కాల్వలు, ఇతర ప్రభుత్వ భూముల కబ్జా యథేచ్ఛగా కొనసాగుతోంది. 8లో



యోగ్యమైన భూములకే భరోసా

సాగుకు అనుకూలమైన భూములకే రైతుభరోసా వర్తించేలా సర్వే చేస్తున్నట్లు డీఏఓ పుల్లయ్య వెల్లడించారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం $31^\circ/16^\circ$

వాతావరణం

జిల్లాలో ఆదివారం రోజంతా సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం దాటాక చలిగాలుల తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

జమలాపురంలో ప్రత్యేక పూజలు



అన్నదానానికి విరాళం అందజేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని శ్రీవారి పాదంతో పాటు స్వామి మూలవిరాట్‌కు తెల్లవారజామునే పంచామృతంతో అభిషేకం జరిపించడమే కాక స్వామి, అమ్మవార్లను పట్టు వస్త్రాలతో అలంకరించి నిత్యకల్యాణం జరిపించారు. ఆతర్వాత పల్లకీ సేవ నిర్వహించగా తెలంగాణ, ఏపీకి చెందిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ కె.జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, ఆలయంలో శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా ఉంగటూరు మండలం మానికొండకు చెందిన సూరారెడ్డి పవన్–పూజ దంపతులు రూ.2లక్షల విరాళాన్ని అందజేశారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌సీ, బ్యాంకింగ్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన ఫౌండేషన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ జ్యోతి తెలిపారు. ఉమ్మడి జిల్లాలో డిగ్రీ ఉత్తీర్ణులైన ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు అర్హులని, ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 9వ తేదీ లోపు http://tgbcstudycircles.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి ఫిబ్రవరి 15 నుంచి శిక్షణ ప్రారంభిస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం 95738 59598, 94419 31359 నంబర్లలో సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

- 2,625 మంది విద్యార్థుల హాజరు



మధిరలో ప్రశ్నాపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

కూసుమంచి/మధిర/సత్తుపల్లి టౌన్: కూసుమంచి మండలంలోని పాలేరు జవహర్ నవోదయ విద్యాలయలో వచ్చే విద్యాసంవత్సరం ఆరో తరగతిలో ప్రవేశాలకు శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆరో తరగతిలో 80సీట్లకు 3,213 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈమేరకు ఉమ్మడి జిల్లాలో 16 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేయగా 2,625 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఖమ్మంలో డీఈఓ సోమశేఖరశర్మ, సత్తుపల్లిలో నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. కాగా, సత్తుపల్లిలో ఏర్పాటుచేసిన రెండు కేంద్రాల్లో 416 మందికి 362 మంది విద్యార్థులు హాజరుకాగా, ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు, హెచ్‌ఎంలు ఎస్.యాకోబు, పి.నాగేశ్వరరావు పర్యవేక్షించారు. అలాగే, మధిర టీవీఎం పాఠశాలలో జరిగిన ప్రవేశపరీక్షకు 155 మంది విద్యార్థుల్లో 124 మంది హాజరయ్యారని ఎంఈఓ వై.ప్రభాకర్ తెలిపారు. కాగా, పరీక్ష నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్ మేడేపల్లి శ్రీనివాసరావు, పరిశీలకులు టి.జ్యోతి, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆర్టిజన్ల దీక్షలు



ఎస్ఈ సురేందర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆర్టిజన్ల ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: ఉద్యోగాలను కన్వర్షన్ చేయాలని కోరుతూ ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు విద్యుత్ శాఖలోని ఆర్టిజన్ ఉద్యోగులు తెలిపారు. ఖమ్మం ఎన్పీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టనున్నందగా, శనివారం ఎస్ఈ ఏ.సురేందర్‌కు ఈ విషయమై వినతిపత్రం అందజేశారు. అంతేకాక విద్యుత్ ఉద్యోగ, కార్మిక సంఘాల ప్రతినిధులను, డివిజన్ల అధికారులను కూడా ఆర్టిజన్ల ప్రతినిధులు కలిసి దీక్షలకు మద్దతు తెలపాలని కోరారు. ఏళ్లుగా సబ్ స్టేషన్లలో ఆపరేటర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తున్నా తమను కంపెనీలో విలీనం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు చేపడుతున్న దీక్షలకు అందరూ సహకరించాలని కోరారు.

ఖిల్లా.. అదిరేలా



జిల్లా చరిత్రలో కీలకమైన ఖమ్మం ఖిల్లా కొత్త శోభ సంతరించుకోనుంది. పర్యాటకంగా పేరు ఉన్నప్పటికీ సందర్శకులను ఆకట్టుకునే పరిస్థితి లేక పోవడంతో పాలకులు దృష్టి సారించారు. ఇన్నాళ్లకు ఖిల్లా అభివృద్ధికి అడుగులు పడుతుండడంతో త్వరలోనే కొత్త రూపు సంతరించుకుంటుందని భావిస్తున్నారు. ఈమేరకు కార్యాచరణ ఆధారంగా పనులు పూర్తయితే జిల్లా వాసులే కాక ఇతర ప్రాంత పర్యాటకులు ఇక్కడకు క్యూ కట్టడం ఖాయమని చెబుతున్నారు.

– ఖమ్మం రాపర్తినగర్

జిల్లా పర్యాటక రంగానికి కొత్త మెరుపు

- పైకి చేరుకునేలా రోప్‌వే నిర్మాణానికి అడుగులు
- అక్కడే అమ్యూజ్‌మెంట్ పార్కు, మినీ థియేటర్ కూడా..
- ఇప్పటికే రూ.29 కోట్ల నిధుల కేటాయింపు



ఖిల్లాపైకి చేరేలా నిర్మించే రోప్ వే చిత్రం

ఇదీ చరిత్ర

వందల ఏళ్ల క్రితం సీతాబ్‌ఖాన్(సీతాపతి) ఖమ్మంను రెండో రాజధానిగా చేసుకుని ఖిల్లా నుంచే పాలన సాగించినట్లు చరిత్ర చెబుతోంది. ఆ తర్వాత 1516లో సీతాబ్‌ఖాన్‌ను కుతుబ్‌షాహీ ఓడించి ఖిల్లాను స్వాధీనం చేసుకున్నాడు. ఆపై 1716–1803 వరకు జాఫర్‌ద్దౌల్లా నేతృత్వాన దీని పర్యవేక్షణ కొనసాగింది. నాలుగు కి.మీ. విస్తీర్ణంలో ఉన్న ఖమ్మం ఖిల్లాను నాడు ఫ్రెంచ్ ఇంజనీర్ల సాయంతో నిర్మించారని చెబుతారు. 15వ శతాబ్దం నాటి శాసనాలు కూడా ఉన్నాయని పరిశోధకులు గుర్తించారు. నిజాం కాలం వరకు దీనిని వేదికగా చేసుకుని పాలన సాగించడం విశేషం. ఎత్తయిన కొండపై ఆ కాలంలోనే ఖిల్లాను నిర్మించగా.. ఇందు కోసం గ్రానైట్ రాయి వాడారు. అలాగే, కాకతీయుల కాలంలో తవ్వించిన బావికి ఆ తర్వాత జాఫర్‌బావిగా పేరొచ్చింది.

సుందరీకరణ వైపు అడుగులు

ఖమ్మం ఖిల్లా అద్భుతంగా ఉంటుందని ఆనోటాఈనోటా జరిగే ప్రచారంతో చూడాలని అందరికీ అనిపించినా పైకి వెళ్లడానికి మెట్లు తప్ప మరో మార్గం లేదు. తొలినాళ్లలో మెట్లు కూడా లేకపోగా పాకుతూ వెళ్లేవారని చెబుతారు. ఆతర్వాత మెట్లు నిర్మించడంతో పలువురు ముందుకొస్తున్నా అంత పైకి ఎక్కలేక చాలా మంది వెనుకడుగు వేస్తున్నారు. ఫలితంగా ఇన్నాళ్లు అభివృద్ధికి నోచుకోక సరైన ఆదరణ దక్కలేదు. ఈనేపథ్యాన అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు ఖిల్లా అభివృద్ధికి నిర్ణయించారు. ఖమ్మం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు పరిశీలించి రోప్ వే నిర్మాణానికి కార్యాచరణ రూపొందించారు. నాటి పాలకుల కోటను ప్రస్తుతం పర్యాటకుల వేదికగా మార్చేందుకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి.

ఎక్కడి నుంచి...

ఖిల్లాపైకి చేరేలా రోప్ వే ఏర్పాటుచేసి బ్యాటరీ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చేలా డీపీఆర్ సిద్ధమైంది. అయితే, రోప్ వే ప్రారంభ స్థానం ఎక్కడ ఏర్పాటుచేయాలనే అంశంపై ఇంకా స్పష్టత రానట్లు తెలిసింది. ముందుగా లకారం పార్క్ నుంచి ప్రారంభించాలని భావించగా అక్కడ ఏవైనా అవాంతరాలు ఎదురైతే పాత మున్సిపల్ ఆఫీస్ వద్ద ఏర్పాటుచేసేలా ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశారు. ఈ విషయమై కొద్దిరోజుల్లో నిర్ణయం తీసుకునే అవకాశముంది.

ఆకట్టుకోవడం ఖాయం..

జిల్లా కేంద్రాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేలా కొన్నేళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా లకారం ట్యాంక్ బాండ్ వద్ద తీగల వంతెన నిర్మించి బోట్ షికారు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇప్పుడు వెలుగుమట్ల పార్క్ అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నారు. ఇంతలోనే ఖిల్లా అభివృద్ధిపై దృష్టి సారించడంతో త్వరలోనే సందర్శకులను ఆకట్టుకునేలా రోప్ వే పనులు మొదలుకానున్నాయి. ఇది పూర్తయితే జిల్లా వాసులే కాక రాష్ట్ర నలుమూలల నుంచి పర్యాటకులు వస్తారని భావిస్తారు. రోప్ ద్వారా బ్యాటరీ కార్లలో ఖిల్లాపైకి చేర్చడమే కాక అక్కడ పిల్లలు, పెద్దల వినోదం, విజ్ఞానాన్ని సైతం అందుబాటులోకి తీసుకొస్తారు. అమ్యూజ్‌మెంట్ పార్క్, మినీ థియేటర్లు, షాపింగ్ మాల్స్ నిర్మించడంతో పాటు వాటర్ ఫౌంటెన్లు ఏర్పాటుచేయాలని ప్రతిపాదనల్లో పొందుపర్చారు.



వీడియో హాల్, మినీ థియేటర్ నమూనా చిత్రాలు

రూ.29 కోట్ల నిధులు

ఖిల్లాపైకి రోప్ వే ఏర్పాటు, ఇతర నిర్మాణాలకు దాదాపు రూ.29 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈవిషయమై అధికారులతో పలుమార్లు సమీక్షించిన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన ప్రత్యేక నిధులు కేటాయించాలని సూచించినట్లు తెలిసింది. అంతేకాక మంత్రి తరచుగా అధికారులతో సమావేశమవుతూ సూచనలు చేస్తుండడంతో త్వరలోనే రోప్ వే నిర్మాణ పనులు మొదలయ్యే అవకాశం కనిపిస్తోంది.

సర్వే.. సమాప్తం



- 'ఇందిరమ్మ' ఇళ్ల జాబితాపై సూపర్‌చెక్ చేస్తున్న ఎంపీడీఓలు
- గ్రామసభల్లో లబ్ధిదారుల జాబితా వెల్లడికి ఏర్పాట్లు
- ఆపై అభ్యంతరాల స్వీకరణ, విచారణ

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ప్రజాపాలన సభల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం అందిన దరఖాస్తుల ఆధారంగా చేపట్టిన క్షేత్రస్థాయి సర్వే పూర్తయింది. మండల స్థాయిలో పూర్తిగా ముగియగా, కేఎంసీ పరిధిలో తుదిదశలో ఉంది. మరోవైపు యాప్‌లో అప్‌లోడ్ చేసిన వాటిలో నుంచి ఐదు శాతం దరఖాస్తులను ఎంపీడీఓలు సూపర్ చెక్ చేస్తున్నారు. ఆతర్వాత మరోసారి సీనియర్ అధికారులతో పరిశీలన ఉంటుంది. ఆపై ఈనెల 21నుంచి మొదలయ్యే గ్రామ, వార్డు సభల్లో లబ్ధిదారుల జాబితాను ప్రకటిస్తారు. అనంతరం అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించాక 26వ తేదీ నుంచి విడతల వారీగా లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు కానున్నాయి.

నియోజకవర్గాల వారీగా దరఖాస్తులు, సర్వే

నియోజకవర్గం	దరఖాస్తులు	సర్వే పూర్తయినవి
ఖమ్మం	70,324	69,041
పాలేరు	70,913	70,896
మధిర	69,918	69,842
వైరా	68,581	68,573
సత్తుపల్లి	78,133	78,112
మొత్తం	3,57,869	3,56,464

మండలాల్లో చకచకా..

మండలాల్లో ఇందిరమ్మ దరఖాస్తుల సర్వే 99 శాతం మేర పూర్తయింది. మండలాల్లో 3,03,878 దరఖాస్తులకు 3,03,756 దరఖాస్తులను పరిశీలించారు. ఇళ్లకు వెళ్లి వారి వద్ద ఉన్న పత్రాలను పరిశీలించడంతోపాటు నివాసముంటున్న ఇంటి ఫొటో తీసి మొబైల్‌యాప్‌లో అప్‌లోడ్ చేశారు. రఘునాథపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి, చింతకాని, మధిర, ఏన్కూరు, కామేపల్లి, వైరా, కల్లూరు, పెనుబల్లి, తల్లాడ మండలాల్లో నూరు శాతం సర్వే పూర్తవగా, మిగిలిన మండలాల్లో 122 దరఖాస్తులు మిగిలినా వాటికి సంబంధించిన వారు అందుబాటులో లేక ఆలస్యం జరుగుతోందని సమాచారం. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే పాలేరులో 17, మధిరలో 76, వైరాలో ఎనిమిది, సత్తుపల్లిలో 21 దరఖాస్తులు పరిశీలించాల్సి ఉంది.

ఖమ్మం కార్పొరేషన్‌లోనూ..

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోనూ సర్వే చివరకు వచ్చేసింది. ఇక్కడ మొత్తం 53,991 దరఖాస్తులు రాగా, ఇప్పటి వరకు 52,708 దరఖాస్తులను పరిశీలించి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. మిగిలిన 1,283 దరఖాస్తులను త్వరగా పూర్తిచేసేలా అధికారులు నిమగ్నమయ్యారు. పరిశీలన పూర్తయ్యాక ఈనెల 20న రీ వెరిఫికేషన్ చేసి గ్రామ/వార్డు సభల్లో జాబితాలు ప్రకటిస్తారు. అక్కడ ఎవరైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తే నమోదు చేసుకుని 23, 24వ తేదీల్లో విచారణ చేపడతారు. మరోచోట ఇల్లు ఉందనో.. బీపీఎల్ కోటా కిందకు రారనో ఫిర్యాదులు వస్తే వాటిపై విచారణ చేపట్టి ఈనెల 26నుంచి మంజూరు ప్రక్రియ ప్రారంభిస్తారు.

భూ సేకరణపై దృష్టి పెట్టండి...

- రిటైనింగ్ వాల్స్ నిర్మాణంలో వేగం పెంచాలి
- పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ శ్రీజ



వైరారూరల్: యూపీఎస్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల పరిధిలో పలు కాలనీలను మున్నేటి ముంపు నుంచి రక్షించేలా రూ.690 కోట్లతో నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్స్ పనులను శనివారం అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ శనివారం పరిశీలించారు. పనుల ప్రగతి, భూసేకరణపై జలవనరులశాఖ ఎస్ఈ మంగళపుడి వెంకటేశ్వర్లు, ఆర్డీఓ నర్సింహారావుతో సమీక్షించారు. పనులతో పాటు అవసరమైన భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో జలవనరులశాఖ డీఈలు మన్మథరావు, ఉదయ్‌ప్రతాప్, ఏఈలు అరుణ, మనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

నారపునేనిపల్లి యూపీఎస్‌లో పరిశీలన

వైరారూరల్: వైరా మండలం నారపునేనిపల్లిలోని యూపీఎస్‌ను శనివారం అదనపు కలెక్టర్ శ్రీజపరిశీలించారు. గతంలో పాఠశాలలో ఒక విద్యార్థిని మాత్రమే ఉండగా అధికారుల చొరవతో మరో ముగ్గురు చేరారు. ఈమేరకు పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రహరీ నిర్మాణం, క్రీడాసామగ్రి ఏర్పాటు తదితర అంశాలపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈమేరకు తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించడం వల్ల లాభాలను గుర్తించాలని సూచించారు. డీఈఓ సోమశేఖరశర్మ, ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ పి.సరస్వతి, ఎంపీఓ జ్యోత్స్నాదేవి పాల్గొన్నారు.

పథకాలపై ఆందోళన వద్దు..

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం నుంచి అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందుతాయని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్పష్టం చేశారు. అయితే, తొలిదఫా మంజూరు కాకున్నా ఆందోళన చెందాల్సిన పని లేదని, దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల ఎంపిక నిరంతరం కొనసాగుతుందని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ ఈనెల 26నుంచి ప్రారంభమవుతుందని వెల్లడించారు. అర్హులందరికీ పథకాలు అందించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు. ఈ నేపథ్యాన దరఖాస్తు చేసుకోని వారు ఉంటే గ్రామసభల్లో లేదా ఎంపీడీఓ, తహసీల్ కార్యాలయాల్లోని ప్రజాపాలన కేంద్రాల్లో సమర్పించాలని సూచించారు. లబ్ధిదారుల జాబితాపై సందేహాలు ఉంటే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌కు 1077 నంబర్ ద్వారా ఫోన్ చేయొచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తామని వెల్లడించారు.

విస్తరణా.. హై లెవల్ వంతెనా?

- ఖమ్మం బైపాస్ రోడ్డుపై మొదలైన సర్వే
- తుది నిర్ణయంపై స్పష్టత ఇవ్వని అధికారులు



ఖమ్మం బైపాస్‌రోడ్డులో సర్వే చేస్తున్న అధికారులు

ఖమ్మంఅర్బన్: జిల్లా కేంద్రంలో నానాటికీ ట్రాఫిక్ పెరుగుతూ ఇబ్బందిగా మారిన బైపాస్ రోడ్డు అభివృద్ధిపై యంత్రాంగం దృష్టి సారించినట్లు తెలిసింది. అయితే, రోడ్డును విస్తరించాలా, ఫ్లై ఓవర్ నిర్మించాలా అన్న అంశంలో సాధ్యాసాధ్యాల పరిశీలనకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉన్న బైపాస్‌రోడ్డు హద్దులపై రెవెన్యూ అధికారులు శనివారం సర్వే చేశారు. ఖమ్మంలోని రాపర్తినగర్ వద్ద రైల్వే వంతెన నుండి వైరా రోడ్డులోని శ్రీశ్రీసర్కిల్ వరకు సర్వే విభాగం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటరావు ఆధ్వరఆయన ఖమ్మం అర్బన్, చింతకాని సర్వేయర్లు వి.నాగేశ్వరరావు, వి.నవీన్, చైన్‌మెన్ బిక్కన్ సర్వే మొదలుపెట్టారు. ప్రస్తుతం ఉన్న బైపాస్‌రోడ్డు నిర్మించిన సమయాన 110 అడుగుల మేర భూసేకరణ చేయగా.. అందులో నాలుగు లేన్ల రహదారి నిర్మించారు. ప్రస్తుతం ఆ స్థలంలో ఆక్రమణలు జరిగియా అని పరిశీలిస్తూ మార్కింగ్ చేస్తున్నారు.

తరచుగా ప్రమాదాలు

సుమారు సుమారు 2 కి.మీ. పొడవైన బైపాస్ రోడ్డులోని ప్రధానంగా కొత్త బస్టాండ్, రాపర్తినగర్ జంక్షన్, ఇల్లెందు క్రాస్‌లోని ఎన్టీఆర్ చౌరస్తా, శ్రీశ్రీ సర్కిల్ వద్ద ట్రాఫిక్ పెరిగింది. దీంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈనేపథ్యాన ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ కోసం ఉన్నతాధికారులు సర్వే చేయిస్తున్నట్లు తెలిసింది. బైపాస్ మీదుగా రాకపోకలు సాగించే వాహనాలు నగరంలోకి రాకుండా నేరుగా వెళ్లేలా రాపర్తినగర్ వద్ద రైల్వే వంతన నుండి శ్రీశ్రీ సర్కిల్ వరకు ఫ్లైఓవర్ (హైలెవల్ వంతెన) నిర్మించే యోచన ఉన్నట్లు సమాచారం. తద్వారా భద్రాద్రి జిల్లాతో ఏపీ రాష్ట్రంలోకి వెళ్లే వాహనాల రద్దీ తగ్గి నగరంలో ట్రాఫిక్ సమస్య తీరుతుందనే భావనకు వచ్చినట్లు తెలిసింది. అయితే, హైలెవల్ వంతెన నిర్మించడమా అది సాధ్యం కాకపోతే నాలుగు లేన్ల రహదారిని ఆరు లేన్లుగా విస్తరిస్తే ప్రయోజనం ఉంటుందా అనే అంశం పరిశీలన దశలో ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం చేపట్టిన సర్వే పూర్తయ్యాక ఓ నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలిసింది. ఈ విషయమై సర్వే అధికారులను ఆరా తీస్తే మాత్రం కారణాలు తమకు తెలియదని, ఉన్నతాధికారుల ఆదేశాలతో సర్వే చేపడుతున్నామని స్పష్టం చేశారు.

త్వరలోనే పేదలకు సన్నబియ్యం



సన్నబియ్యాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ నాగేశ్వరరావు

రఘునాథపాలెం: పేదల సంక్షేమానికి పాటుపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేయనుందని రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు వెల్లడించారు. రఘునాథపాలెంలోని జింకలతండా క్రాస్‌లో ఉన్న గిడ్డంగుల సంస్థ గోదాముల్లో మిల్లర్లు అప్పగిస్తున్న సన్నబియ్యాన్ని నిల్వ చేస్తున్నారు. ఈ బియ్యాన్ని శనివారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ.. రేషన్ షాపుల ద్వారానే కాక పాఠశాలలు, హాస్టళ్లలో మధ్యాహ్న భోజనానికి ఇదే బియ్యాన్ని సరఫరా చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పుచ్చకాయల వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

విభజించి.. పాలిస్తూ...

- టెండర్ లేకుండానే మొక్కల కొనుగోలు
- కేఎంసీలో నామినేషన్ పద్ధతిపై ఒకే కాంట్రాక్టర్‌కు బాధ్యత

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో కొందరు అధికారులు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వం మారినా అధికారుల తీరు మారలేదని, వారికి నచ్చిన ఒకరిద్దరికే పనులు కేటాయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు తమ అవసరాల కోసం పనులను విభజించి నామినేషన్ పద్ధతిపై అనుకూలంగా ఉండే కాంట్రాక్టర్లకు అప్పగిస్తూ, మిగతా వారికి మొండిచేయి చూపుతున్నారనే చర్చ జరుగుతోంది. ఇటీవల కేఎంసీ పరిధిలో నాటేందుకు దాదాపు రూ.21 లక్షల వ్యయంతో మొక్కలు కొనుగోలు చేసినట్లు తెలిసింది. అయితే, మొక్కల సరఫరా బాధ్యతలను టెండర్లు లేకుండా ఒకరికే అప్పగించడం గమనార్హం. కేఎంసీ పరిధిలో అర్హులైన కాంట్రాక్టర్లు పదుల సంఖ్యలో ఉన్నా ఒకరికే బాధ్యతలు ఇవ్వడంతో మిగతా వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నామినేషన్ పద్ధతే ఆధారం

నగర పాలక సంస్థలో రూ.5 లక్షల్లోపు పనులను టెండర్ లేకుండానే అధికారులు నామినేషన్ పద్ధతిపై కేటాయించే అవకాశముంది. ఇదే అదునుగా రూ.10లక్షలు, ఆపై విలువైన పనులను సైతం అధికారులు రూ.5 లక్షల లోపుగా విభజించి నామినేషన్ పద్ధతిపై నచ్చిన కాంట్రాక్టర్లకు ఇస్తున్నారని తెలుస్తోంది. ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో డివైడర్లు, ప్రభుత్వ స్థలాల్లో కోనోకార్పస్ మొక్కలను తొలగించి వాటి స్థానంలో పూలు, పండ్ల మొక్కలను అధికారులు నాటించారు. అంతేకాక పార్కులు, వాకింగ్ ట్రాక్‌ల్లోనూ మొక్కలను నాటించగా 6వేల మొక్కలను అధికారులు తెప్పించినట్లు తెలిసింది. ఒక్కో మొక్కకు రూ.350 వరకు వెచ్చించగా.. మొత్తం రూ.21 లక్షల వరకు ఖర్చు చేసినట్లు సమాచారం. ఇంతమొత్తంలో నిధులు వెచ్చించాలంటే టెండర్ల పిలవడం తప్పనిసరి. అలా అయితే తమకు లాభం జరగదనుకున్నారో ఏమో కానీ అధికారులు ఐదు పనులుగా విభజించి నామినేషన్ పద్ధతిపై ఒకే కాంట్రాక్టర్‌కు అప్పగించారని సమాచారం. ఈ అంశంపై ప్రస్తుతం కేఎంసీ కాంట్రాక్టర్లలో చర్చనీయాంశంగా మారింది.

మధిర బస్టాండ్‌కు మహర్దశ

ఆధునికీకరణకు రూ.10కోట్ల నిధులు



మధిరలోని ప్రస్తుత బస్టాండ్

మధిర: తెలంగాణ–ఏపీ కూడలిగా ఉన్న మధిర బస్టాండ్ ఆధునికీకరణకు అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఆర్టీసీ బోర్డు సమావేశంలో రూ.10 కోట్ల నిధులు కేటాయిస్తూ ఆమోదించారు. మధిర బస్ స్టేషన్ సుందరీకరణలో భాగంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధులను ఆర్టీసీ మంజూరు చేసింది.

1984లో అంకురార్పణ

నియోజకవర్గ కేంద్రమైన మధిరలో బస్టాండ్ నిర్మాణానికి 1984 ఏప్రిల్ 25న నాటి సీఎం ఎన్టీఆర్ శంకుస్థాపన చేశారు. ఆతర్వాత బస్టాండ్ను 1990 అక్టోబర్ 26న ఆనాటి రవాణా శాఖ మంత్రి ముక్కపాటి వెంకటేశ్వరావు ప్రారంభించారు. తెలంగాణ – ఏపీ సరిహద్దులో ఉన్న మధిర నియోజకవర్గం వ్యవసాయ, వ్యాపార, వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతోంది. ఇరు రాష్ట్రాల నుంచి వచ్చివెళ్లే వారి రాకపోకలకుఆరు ప్లాట్‌ఫాంలతో ఉన్న బస్టాండ్ సరిపోవడం లేదు. దీంతో డిప్యూటీ సీఎం సూచనలతో రూ.10 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో ప్రస్తుతం ఉన్న బస్టాండ్‌ను పూర్తిగా తొలగించి 2.50 ఎకరాల్లో కొత్తగా నిర్మాణాలు చేపడుతారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో బస్టాండ్, మొదటి అంతస్తులో కార్యాలయ గదులతో పాటు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిసింది. ఈ నిర్మాణం పూర్తయితే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందనున్నాయి.

క్లుప్తంగా

నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ఎర్రుపాలెం/ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదివారం ఎర్రుపాలెం మండలంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12–15గంటలకు ఎర్రుపాలెం మండలం నరసింహాపురానికి చేరుకోనున్న ఆయన అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యాక సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఒంటి గంటకు బుచ్చిరెడ్డిపాలెంలో, 1–30కు చొప్పకట్లపాలెంలో, ఆతర్వాత బనిగండ్లపాడులో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడమే కాక ప్రభుత్వాస్పత్రి భవనం, వ్యవసాయ గోదాంను ప్రారంభిస్తారు. ఆతర్వాత 3గంటలకు సఖినవీడులో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. కాగా, బీఆర్‌ఎస్‌కు ఇటీవల రాజీనామా చేసిన మార్కెట్ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు తదితరులు భట్టి సమక్షాన కాంగ్రెస్‌లో చేరనున్నారని పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

వ్యాయామ విద్యలో డాక్టరేట్



ఓయూ ప్రొఫెసర్ల నుంచి డాక్టరేట్ అందుకుంటున్న కోటి

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని కేయూ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకుడు పేరెల్లి కోటికి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. 'హిస్టారికల్ డెవలప్‌మెంట్ ఆఫ్ కబడ్డీ ఇన్ ఇండియా విత్ ఏ స్పెషల్ రిఫరెన్స్ టూ తెలంగాణ' అంశంపై ఆయన ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కె.సురేందర్‌రెడ్డి పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాపత్రానికి డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా కోటిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్, అధ్యాపకులు అభినందించారు.

రక్తదాత రాంకుమార్

వంద సార్లకు పైగా రక్తదానం



రక్తదానం చేస్తున్న రాంకుమార్

ఖమ్మంమయూరిసెంటర్: అత్యవసర సమయాల్లో రక్తం లభించక పలువురు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న ఆయన రక్తదానం చేయడాన్ని మొదలుపెట్టాడు. అలా వంద సార్లకు పైగా రక్తదానం చేసిన ఖమ్మంకు చెందిన దమ్మాలపాటి రాంకుమార్ పలువురిని ఆదుకున్నాడు. స్థానిక శ్రీచైతన్య విద్యాసంస్థల్లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయనది ఏబీ నెగెటివ్ గ్రూపు రక్తం కావడంతో గర్భిణులకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు. ఇప్పటివరకు వంద సార్లకు పైగా రక్తదానం చేసిన రాంకుమార్ ఇటీవల నోయిడా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నుంచి ఆంగ్లంలో డాక్టరేట్ సాధించారు.

పెండింగ్ దరఖాస్తులకు మోక్షం

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు ఇచ్చేలా ఇటీవల మార్గదర్శకాలు జారీ చేసింది. ఈనెల 26నుంచి రేషన్‌కార్డులు జారీ చేయనుండగా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అధికారులు దరఖాస్తుల విచారణ చేస్తున్నారు. ఇప్పటి వరకు 61,374దరఖాస్తులు కుటుంబ సభ్యుల మార్పులు, చేర్పుల కోసం అందగా ఇందులో 40,266 దరఖాస్తులు ఆర్‌ఐల వద్ద, 3,135 దరఖాస్తులు తహసీల్దార్ల వద్ద పెండింగ్ ఉన్నాయి. అలాగే, జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి వద్ద 17,973దరఖాస్తులు ఉన్నాయని తెలిసింది. కాగా, ఆర్‌ఐల వద్ద 40,266దరఖాస్తులను విచారిస్తూ గ్రామసభల్లో ఆమోదించగానే అర్హులైన వారి పేర్లను కార్డుల్లో నమోదు చేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ తెలిపారు.


ఎన్పీడీసీఎల్ 327 యూనియన్ ప్రతినిధిగా మందపాటి



సత్యనారాయణరెడ్డి

ఖమ్మంవ్యవసాయం: ఎన్పీడీసీఎల్‌లోని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం(327) ప్రతినిధి వర్గంలో ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మందపాటి సత్యనారాయణరెడ్డికి ప్రాతినిధ్యం దక్కింది. కంపెనీ ప్రతినిధి వర్గం ఎన్నికలను శనివారం హన్మకొండలో నిర్వహించగా సీనియర్ వర్కింగ్ ప్రసిడెంట్‌గా సత్యనారాయణరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే, కంపెనీ ఉపాధ్యక్షులుగా పి.భాస్కర్, ఆర్గనైజింగ్ కంపెనీ జాయింట్ సెక్రటరీగా ఎస్.వెంకన్న ఎన్నికయ్యారు. సత్యనారాయణరెడ్డి ఎన్నికపై సంఘం జిల్లా కార్యదర్శి వి.సీతారాంగోపాల్‌తో పాటు ప్రతినిధులు వల్లాల యుగంధర్, జీ.వీ.రామారావు, తదితరులు, సీనియర్ నాయకులు గాదె మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర రూ.20,506

ఆగని ఆక్రమణలు..



ఆక్రమణకు గురైన ఎదులాపురం చెరువు శిఖం

అర్బన్, రూరల్ మండలాల్లో ప్రభుత్వ భూమి కనిపిస్తే ఖతమే

- ఒక్క ఏదులాపురంలోనే 35 ఎకరాల చెరువు శిఖం ఆక్రమణ
- ఆక్రమిత భూముల విలువ రూ.100 కోట్లకు పైమాటే
- అయినా పట్టించుకోని అధికారులు

ఖమ్మంరూరల్: కబ్జాకు కాదేదీ అనర్హం అన్నట్లు ఏకంగా వ్యవసాయ భూములకు వెళ్లే డొంక రహదారులు, పంట కాల్వలు, చెరువు శిఖం భూములను అక్రమార్కులు కబ్జా చేస్తున్నా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదు. జిల్లా కేంద్రమైన ఖమ్మం అర్బన్ మండలంతో పాటు ఆనుకుని ఉన్న రూరల్ మండలాల్లో భూముల ధరలు ఆకాశాన్ని అంటుతుండడాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు రియల్టర్లు నిబంధనలు తుంగలో తొక్కి వెంచర్ల పేరుతో అనుమతి లేకుండానే పంట భూములను ధ్వంసం చేస్తున్నారు. దీనికి తోడు అధికారుల అండదండలతో ప్రభుత్వ భూములను కలిపేసుకుంటున్నారు. ఎక్కడ వీలు కుదిరితే అక్కడ ప్రభుత్వ భూములు, పంట కాల్వలలను ఆక్రమిస్తున్నట్లు కళ్ల ముందే కనిపిస్తున్నా అధికారులు చోద్యం చేస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

వంద ఎకరాలకు పైగానే..

ఖమ్మం రూరల్, ఖమ్మం అర్బన్ మండలాల్లో కబ్జాల పర్వం యథేచ్ఛగా కొనసాగుతుండగా ఇప్పటి వరకు 100 ఎకరాల మేర ప్రభుత్వ భూమి ప్రైవేట్ పరమైనట్లు సమాచారం. దీని విలువ రూ.100కోట్ల పైమాటే ఉంటుందని చెబుతున్నారు. రెవెన్యూ, ఎన్‌ఎస్‌పీ, ఐబీ అధికారులు పట్టించుకోకపోవడంతో రియల్టర్ల, భూకబ్జాదారులు చెలరేగిపోతున్నారు. ఖమ్మం రూరల్ మండలంలో ఏదులాపురం చెరువు నుండి గుర్రాలపాడు వెళ్లే సాగర్ పంట కాలువ 33అడుగులకు బదులు ఆక్రమణలతో కేవలం ఐదు అడుగులకు చేరిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఫలితంగా పంటపొలాలకు సరిగా నీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. రూరల్ మండలంలోని పెదతండా, ఏదులాపురం, గొల్లగూడెం, ముత్తగూడెం, వరంగల్ క్రాస్ రోడ్ ప్రాంతాల్లో కాల్వల ఆక్రమణ ఎక్కువగా ఉంది. ఎన్నెస్పీ పిల్ల కాల్వల నుండి పంట పొలాలకు సాగునీటిని చేర్చేలా 30 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఏదులాపురం చెరువు నుండి పెదతండా గుర్రాలపాడు వరకు 33అడుగుల కాల్వ తవ్వించింది. ఎప్పుడైతే రియల్ వ్యాపారం మొదలైందో అప్పటి నుండి కాల్వ క్రమంగా తగ్గుతూ ఇప్పుడు కనుమరుగయ్యే పరిస్థితికి చేరింది.

35 ఎకరాల చెరువు కూడా..

ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురంలో 150 ఎకరాలు ఉండాల్సిన చెరువులోని 35 ఎకరాలు ఆక్రమణకు గురైంది. దీంతో స్థానికులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా అప్పటి జిల్లా కలెక్టర్ ఆదేశాల ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి చెరువు శిఖం ఆక్రమణకు గురైనట్లు తేల్చారు. ఆపై చెరువు భూమికి హద్దులు నిర్ణయించాలని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తే ఇప్పటివరకువా పని జరగలేదు.

నిబంధనలు గాలికి....

ప్రభుత్వ నిబంధనల మేరకు పంట కాల్వలను పూడ్చడం, అనుమతి లేకుండా కాల్వలపై మట్టివేసి పైప్‌లైన్ సాయంతో రోడ్డు నిర్మించడం నేరంగా పరిగణిస్తారు. సాగునీటి వనరుల భూములను ఆక్రమించడం, వాటిపై నిర్మాణాలు చేపట్టడం, స్వంత ప్రయోజనాలకు కాల్వలను వినియోగించడం చట్టరీత్యా నేరమవుతుంది. ఈక్రమాన రియల్టర్లు సంబంధిత అధికారుల నుండి ఎన్‌ఓసీ తీసుకున్నాకే ప్రజల సౌకర్యార్థం కాల్వలపై రోడ్డు కానీ భవన నిర్మాణాలు కానీ చేపట్టాల్సి ఉంటుంది. అయితే, ఈ నిబంధనలను ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు.

చోద్యం చూస్తున్నారా..?

అధికారుల అలసత్వమో, నిర్లక్ష్యమో లేదా ఇంకేమైనా కారణమో తెలియదు కానీ రియల్టర్లు చెరువులు, పంట కాల్వలు, డొంక రహదారులను ఆక్రమించేస్తున్నారు.ఏదులాపురం చెరువు నుండి మొదలైన కాల్వల ఆక్రమణ పర్వం పెదతండా నుండి గుర్రాలపాడు రెవెన్యూ వరకు కొనసాగుతూనే ఉంది. ఏదులాపురం, పెదతండా, గుర్రాలపాడు రెవెన్యూ ప్రాంతాల్లో వేల ఎకరాల వ్యయసాయ భూములు ఇప్పుడు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారాయి. దీంతో రియల్టర్లు ఈ ప్రాంతం పొడవునా 33 అడుగులుగా ఉన్న సాగర్ కాల్వను ఐదు అడుగులకు కుదించేశారు.

కాల్వలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

పంటల కాల్వలను ఎవరైనా ఆక్రమించినట్లే తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు ఎక్కడైనా ఆక్రమణకు గురయ్యాయా అనే అంశంపై వివరాలు సేకరిస్తున్నాం. రియల్ ఎస్టేట్ వెంచర్ల పక్కన కాల్వలను ఆక్రమిస్తే స్వాధీనం చేసుకుంటాం. నిర్మాణాలకు దరఖాస్తులు వస్తే అన్నీ విచారించాకే ఎన్‌ఓసీ జారీ చేస్తున్నాం.

– వెంకటశాస్త్రి, ఇరిగేషన్ డీఈ

వైరా రిజర్వాయర్‌కు సాగర్ జలాలు

సాక్షి ఎఫెక్ట్..

వైరా: వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో రైతులు రబీ వరి సాగుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పలువురు నారుమడులు సిద్ధం చేసుకోగా, ఇంకొందరు నాట్లు కూడా వేశారు. అయితే, రిజర్వాయర్‌లో నీటిమట్టం నానాటికీ తగ్గుతుండడంతో రబీ సాగుకు ఇక్కట్లు ఎదురవుతాయనే అంశంపై ఈనెల 17వ తేదీన 'సాగర్ నీరు వస్తేనే సాఫీగా..' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు రిజర్వాయర్‌లోకి సాగర్ జలాల విడుదలకు అంగీకరించారు. ఈమేరకు శనివారం నుండి రోజుకు 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. అలాగే, ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ ఎన్నెస్పీ అధికారులతో మాట్లాడడంతో రబీలో సాగు అవసరాలతో పాటు తాగునీటికి ఇబ్బంది లేకుండా ఒక టీఎంసీ నీరు విడుదల చేయనున్నట్లు వెల్లడించారని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే ఏన్కూరు మండలం తిమ్మరావుపేట ఎస్కేప్ లాక్‌ల ద్వారా నీరు వస్తుండగా ఇంకొంత మేర పెంచనున్నారు.

పాలేరు రిజర్వాయర్ పరిశీలన



రిజర్వాయర్ అలుగుల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్‌ను శనివారం ఓఅండ్‌ఎం విభాగం అధికారులు పరిశీలించారు. జలవనరుల శాఖ ఎస్‌ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లుతో కలిసి ఓఅండ్‌ఎం సీఈ శ్రీదేవి, ఈఈ వెంకటరమణ, డీఈ నాగజ్యోతి రిజర్వాయర్ అలుగులు, పాత కాల్వను పరిశీలించి నిర్వహణపై ఆరా తీశారు. గత ఏడాది సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వరదలతో పాలేరు కాల్వ, ఎడమ కాల్వ దెబ్బతినగా చేపట్టిన మరమ్మతులను పరిశీలించారు. అలుగుల వద్ద దెబ్బతిన్న చప్టా, గేట్ల వద్ద లీకేజీలతో పాటు పాలేరు పాత కాల్వపై చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఈకార్యక్రమంలో డీఈఈలు రత్నకుమారి, మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టేలా బీజేపీ తీరు

రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి



మాట్లాడుతున్న ఎంపీ రేణుకాచౌదరి, పక్కన నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలను మభ్యపెట్టే విధానాలను అవలంభిస్తూ పబ్బం గడుపుకుంటోందని రాజ్యసభ సభ్యురాలు గారపాటి రేణుకాచౌదరి ఆరోపించారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ ఇటీవల పార్లమెంట్‌లో అంబేద్కర్‌పై హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమన్నారు. దొంగ సర్టిఫికెట్లతో పార్లమెంట్‌లో అడుగుపెట్టిన వారు ఇతరులను తప్పుపట్టడం గర్హనీయమని పేర్కొన్నారు. కాగా, బీజేపీ నేతలు ప్రతీ విషయంలో తమ నాయకుడు రాహుల్‌గాంధీపై విమర్శలు చేస్తుండడం మానుకోవాలని సూచించారు. ఆర్థిక సంస్కరణలతో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ దేశానికి సేవలు చేయగా, ప్రస్తుత ప్రధాని రోజుకు నాలుగు డ్రస్సులు మార్చడం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వాన రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని ఆమె తెలిపారు. ఇక కల్వకుంట్ల కుటుంబంలో కవిత ఇప్పటికే జైలుకు వెళ్లిరాగా, కేటీఆర్ వంతు వచ్చిందని.. త్వరలోనే అందరూ వరుస కడతారని ఆమె చెప్పారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర మేయర్ నీరజతో పాటు కొరివి వెంకటరత్నం, మానుకొండ రాధాకిషోర్, జలీల్, మద్ది శ్రీనివాసరెడ్డి, రఫీదాబేగం, మహ్మద్ ముస్తఫా, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై బహిరంగ చర్చకు సిద్ధమా?

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మధు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు

మధిర: కాంగ్రెస్ ప్రభుత్వం ఏ గ్రామంలో కూడా రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ విమర్శించారు. ఆత్కూర్ మాజీ సర్పంచ్ అబ్బూరి సంధ్యారాణి నివాసంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురం, మధిర నియోజకవర్గంలో ఏ గ్రామంలో కూడా సంపూర్ణంగా రుణమాఫీ జరగలేదని నిరూపించేందుకు తాము సిద్ధమని తెలిపారు. కాగా, భట్టి విక్రమార్క సతీమణి నందిని, మంత్రి పొంగులేటి మేనల్లుడు దయాకర్‌రెడ్డికి పోలీసులు ఏ హోదా ఉందని ఎస్కార్ట్ ఇస్తున్నారో చెప్పాలన్నారు. ఏళ్లుగా మంత్రిగా పనిచేస్తున్న తుమ్మల నాగేశ్వరావు తన భార్య లేదా కుమారుడికి పోలీస్ ఎస్కార్ట్ అడగలేదని.. ఈ విషయంలో తుమ్మలను చూసి రాజకీయ విలువలు నేర్చుకోవాలని సూచించా రు. కాగా, అబ్బూరి రామకృష్ణ కన్నుమూశాక గ్రామపంచాయతీ తీర్మానంతో ఆత్కూర్ జంక్షన్‌కు ఆయన పేరు పెడితే రాజకీయ కక్షతో తొలగించడం సరికాదన్నారు. జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, కనుమూరి వెంకటేశ్వరరావుతో పాటు మీనుగు పాండు, అబ్బూరి రామన్ తదితరులు పాల్గొన్నారు.

32మంది దరఖాస్తుల పరిశీలన

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో పరస్పర బదిలీలకు 45మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోగా పరిశీలన శనివారం మొదలైంది. తొలిరోజు 32మంది ఉపాధ్యాయుల దరఖాస్తులను పరిశీలించినట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఈనెల 22వ తేదీ వరకు అవకాశం ఉందని ఆయన వెల్లడించారు.

లింక్‌రోడ్డు వంతెన నిర్మాణానికి రూ.99 లక్షలు

ఖమ్మంఅర్బన్: కొద్దినెలల క్రితం వచ్చిన వరదతో మండలంలోని కోయచలక – చిమ్మపుడి లింక్ రోడ్డులో వంతెన తెగిపోగా నిర్మాణానికి రూ 99 లక్షలు విడుదలయ్యాయి. ఖమ్మం నుండి కోయచలక, పాపటపల్లి ద్వారా డోర్నకల్ వెళ్లేలా లింక్ రోడ్డుగా ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారిపై వంతెన కొట్టుకుపోవడమే కాక తారు రోడ్డు కోతకు గురైంది. అప్పట్లోనే తాత్కాలిక మరమ్మతులు చేసినా మళ్లీ వచ్చిన వర్షంతో కొట్టుకుపోయింది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. ఈనేపథ్యాన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో అధికారులు శాశ్వతంగా వంతెన నిర్మాణానికి నిధులు విడుదల చేయగా, ఒకటి రెండు రోజుల్లో టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టనున్నట్లు తెలిసింది.

సాగు యోగ్యమైన భూములకే రైతుభరోసా..

జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య



కోయచలకలో సర్వే వివరాలు ఆరా తీస్తున్న డీఏఓ పుల్లయ్య

రఘునాథపాలెం/తల్లాడ: సాగు యోగ్యమైన భూములకు మాత్రమే రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందేలా భూముల సర్వే చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య వెల్లడించారు. రఘునాథపాలెం మండలంలోని కోయచలకతో పాటు తల్లాడ మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన భూసర్వేను శనివారం ఆయన పరిశీలించాక రైతులతో మాట్లాడారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా సాగు భూములకే పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ నేపథ్యాన వెంచర్లు, గుట్టలు, రహదారులు, క్వారీలు, మిల్లులు, ఇటుకబట్టీలు ఉన్న భూములను జాబితా నుంచి తొలగిస్తామని చెప్పారు. కాగా, ఈ సర్వే ద్వారా రఘునాథపాలెం మండలంలో పెట్టుబడి సాయానికి 500 ఎకరాలపైగా భూమి తగ్గనున్నట్లు తెలిసింది. ఈసర్వేలో ఏఓలు కె.ఉమామహేశ్వరరెడ్డి, ఎం.డీ.తాజుద్దీన్, ఆర్‌ఐ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సంచార ప్రయోగశాల ద్వారా నీటి పరీక్షలు



తుమ్మలపల్లిలో నీటి నాణ్యతను పరిశీలిస్తున్న ఉద్యోగులు

కొణిజర్ల: నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్‌లో భాగంగా సంచార నీటి నాణ్యతా ప్రయోగశాల వాహనం ద్వారా రైతులకు నీటి నాణ్యతపై అవగాహన కల్పిస్తున్నారు. రెండు రోజులుగా కొణిజర్ల మండలం తుమ్మలపల్లి, కొణిజర్ల, గుబ్బగుర్తి, ఏన్కూరు మండలంలోని ఏన్కూరు, నాచారంల్లో పర్యటించిన శాస్త్రవేత్తలు వివరాలను వెల్లడించారు. భూగర్భ జలాలు తక్కువగాఉన్న గ్రామాల్లో సంచారవాహనం ద్వారా పర్యటిస్తూ భూగర్భ జలాల్లో లవణాలు, ఫ్లోరైడ్, నైట్రేట్, పీహెచ్‌సీ, సల్ఫర్ ఎంత మోతాదులో ఉందో పరీక్షించి వ్యవసాయానికి అనుకూలమా, కాదా అన్నది రైతులకు వివరిస్తున్నట్లు అసిస్టెంట్ హైడ్రాలజిస్టులు జి.విష్ణు, పి.నరేష్ తెలిపారు. రైతులు అధిక మోతాదులో రసాయన మందులు వాడితే దుష్పరిణామాలపై అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కెమిస్టులు జె.శిల్ప, కె.సుదీప్, ఎస్.రవికుమార్, డేటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

వైరా/కొణిజర్ల: పైసాపైసా కూడబెట్టుకుని విల్లాలు కొనుగోలు చేస్తే, గ్రీన్‌ల్యాండ్ డెవలపర్స్ యజమానులు తమకు తెలియకుండా ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేశారని పలువురు ఆరోపించారు. ఈమేరకు తనికెళ్లలోని విల్లాల వద్ద శనివారం యజమానులు కోనేరు ప్రసాద్, మద్దెల నటరాజు, కొక్కుల రాధాకృష్ణ, తుమ్మలపల్లి ప్రవీణ్ తదితరులు మాట్లాడారు. ఇండో ఖతార్ ప్రాజెక్ట్ మేనేజింగ్ డైరెక్టర్ పొలిశెట్టి గిరి వద్ద 2017 నుంచి 2022 వరకు రూ.65లక్షల నుంచి రూ.75లక్షల వరకు చెల్లించి విల్లాలు కొనుగోలు చేశామని, వీటిని గ్రీన్ ల్యాండ్ డెవలపర్స్‌కు చెందిన కిషోర్, రాము, నాగేశ్వరరావు, శరత్ గత నెల 28న ఇతరులకు రిజిస్ట్రేషన్లు చేశారని తెలిపారు. ఇప్పటికే మార్టిగేజ్, బ్యాంకు రుణాలు తీసుకోవడంతో ఇంటి పన్ను కూడా చెల్లిస్తున్నందున అధికారులు స్పందించి అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించిన వారిపై చర్యలు తీసుకోవడమే కాక తమకు న్యాయం చేయాలని కోరారు.

పొరపాట్లను సరి చేసుకుంటాం

గ్రీన్ ల్యాండ్ డెవలపర్స్‌కు సంబంధించి గతనెల 28న జరిగిన రిజిస్ట్రేషన్లలో దొర్లిన పొరపాట్లను సరిచేసుకుంటామని సహ యజమాని మక్కెన రాము శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఈనెల 17న వైరా సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ ఇచ్చినట్లు వెల్లడించారు. గత నెల 28న జరిగిన 64 రిజిస్ట్రేషన్లలో కొన్నింటి విషయమై తప్పులు జరగగా, ఆపై గుర్తించగానే కొనుగోలుదారులకు చెప్పడంతో సహకరించడానికి అంగీకరించారని తెలిపారు. దీంతో క్యాన్సిలేషన్ సమర్పించేందుకు సిద్ధమయ్యాయని వెల్లడించారు. కాగా, ఈ విషయమై కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కార్తీక్‌ను వివరణ కోరగా గ్రీన్ ల్యాండ్ డెవలపర్స్ బాధ్యులు లేఖ ఇవ్వగా, జిల్లా రిజిస్ట్రార్‌కు సమర్పించాలని సూచించినట్లు తెలిపారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

మైనర్‌పై లైంగిక వేధింపులు

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురానికి చెందిన బాలికను లైంగికంగా వేధిస్తున్న వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. బాలిక పాఠశాలకు వెళ్లిన సమయాన స్కూల్ బస్‌డ్రైవర్ జయప్రసాద్‌రావు ఆమెను బస్సులోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించడమేకాక ఈ విషయం ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడు. ఘటనపై బాధితురాలి తండ్రి ఫిర్యాదుతో నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మృతి



సెల్యూకాస్ (ఫైల్)

ఖమ్మంస్పోర్ట్స్: ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సంఘం కోశాధికారి కేఈ సెల్యూకాస్ (45) గుండెపోటుతో మృతి చెందారు. హైదరాబాద్‌లో ఆయన నివాసంలో శనివారం గుండెనొప్పి రాగా కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. సెల్యూకాస్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన స్వస్థలం పాల్వంచ కాగా కొన్నాళ్లుగా హైదరాబాద్‌లో ఉంటూ బ్యాటరీలు, ఇన్వర్టర్ల ఫ్యాక్టరీలు నిర్వహిస్తున్నారు. స్వతహాగా ఫుట్‌బాల్ క్రీడాకారుడైన సెల్యూకాస్ దశాబ్ద కాలంగా జిల్లాలో అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తూ క్రీడాకారులకు చేయూతనిస్తున్నారు. ఆయన మృతిపై డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు పుట్టా శంకరయ్య, కె.ఆదర్శ్‌కుమార్, కె.క్రిస్టోఫర్ బాబు, రఘునందన్, షఫీ, ఉప్పల్‌రెడ్డి తదితరులు సంతాపం ప్రకటించారు.

మరణించినా.. జీవించి ఉండేలా

బ్రెయిన్‌డెడ్ యువకుడి అవయవాలదానం



బుర్రా మహేష్ (ఫైల్)

కూసుమంచి: బ్రెయిన్‌డెడ్ అయిన యువకుడి అవయవాలను దానం చేయడం ద్వారా ఆయన మరో పది మందికి ప్రాణదానం చేసినట్లయింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కూసుమంచి మండలం చేగొమ్మకు చెందిన బుర్రా మహేష్(26) కూసుమంచిలో ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తున్నాడు. ఈనెల 15న పొలానికి పురుగుల మందు పిచికారీ చేసిన ఆయన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లడంతో తలకు తీవ్ర గాయమైనందున బ్రెయిన్ డెడ్ అయిందని వైద్యులు నిర్ధారించారు. దీంతో ఆయన అవయవాలను దానం చేసి పలువురికి ప్రాణదానం చేయాలని కుటుంబసభ్యులు నిర్ణయించారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆస్పత్రిలో మహేష్ గుండె, కళ్లు, కిడ్నీలు తదితర అవయవాలను సేకరించి అవసరమైన వారికి అమర్చారు. అనంతరం మహేష్ మృతదేహానికి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించగా గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సీపీఎం నాయకుడు...



వెంకన్న (ఫైల్)

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెం వద్ద ఖమ్మం–వైరా రహదారిపై శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో తిరుమలాయపాలెం మండలం పాపాయిగూడెంకు చెందిన సీపీఎం నాయకుడు రేపాకుల వెంకన్న(54) మృతి చెందాడు. స్వగ్రామం నుంచి వీ.వీ.పాలెం వైపు వెంకన్న బైక్‌పై వస్తుండగా వెనక నుండి వచ్చిన మరో వాహనదారుడు ఢీకొట్టాడు. ఈఘటనలో గాయపడిన ఆయనను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడని సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. కాగా, వివిధ పార్టీల నాయకులు షేక్ బషీరుద్దీన్, బండి రమేష్, యర్ర శ్రీనివాసరావు, కొమ్ము శ్రీను, చల్లా వెంకటేశ్వర్లు, పప్పుల ప్రసాద్, పద్మనాబుల సుధాకర్, అంగిరేకుల నరసయ్య తదితరులు వెంకన్న మృతదేహం వద్ద నివాళులర్పించారు.